## 21 నుంచి ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, జూలై 19 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా 21, 22 తేదీల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. ఈ ఆంక్షలు 21వ తేదీ తెల్లవారుజాము నుంచి మరుసటి రోజు ఉత్సవాలు పూర్తయ్యే వరకు అమలులో ఉంటాయన్నారు. బోనాల పండుగ సందర్భంగా వచ్చే భక్తులతో ఆలయం సమీపంలో రద్దీ ఎక్కువగా ఉంటుందని ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు, వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు ప్రయాణం చేసే వారు సరైన సమయానికి స్టేషన్‌లోకి ఫ్లాట్ ఫామ్ నెం. 1 నుంచి వెళ్లే వారు రద్దీ ఎక్కువ ఉండటంతో చిలకలగూడ వైపు నుంచి వచ్చి ఫ్లాట్ ఫామ్ నెం.10ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆలయానికి రెండు కిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్ రద్దీ ఉంటుందన్నారు.

## పకడ్బందీగా పారిశుధ్య నిర్వహణ

### జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

జూబ్లీహిల్స్, జూలై 19: వర్షాల నేపథ్యంలో గ్రేటర్ వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. జోనల్ కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లు, డీసీలు, ఏఎంఓహెచ్‌లతో ఆమె శుక్రవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పారిశుధ్య నిర్వహణతో ముడిపడి ఉన్న డెంగీ, సీజనల్ వ్యాధులపై పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందులో భాగంగా డెంగీ కేసులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కేసులు పెరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఆయా కేసుల వివరాలు ఎప్పటికప్పుడు అందించాలని పేర్కొన్నారు. రోడ్లపై, చెరువులు, నాలాల వద్ద భవన నిర్మాణ వ్యర్థాలు ఉంచొద్దని, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. రోడ్లపై పాత్‌హోల్స్ కనబడకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని, వర్షపు నీటితో ఈ గుంతలు కనబడక ప్రజలు, వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉంటుందని, తక్షణమే స్పందించి పనులు చేపట్టాలని సూచించారు.








